క్లుప్తంగా

కంటి అద్దాల పంపిణీ



గట్టు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం వైద్యులు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శశికిరణ్, సీహెచ్ఓ ఊసేని, ఏఎన్ఎం తాహేరా, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కలిసిన తపస్ నాయకులు



గట్టు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలోని ఉపాధ్యాయులను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి కలిశారు. ఆయా పాఠశాలలో సమావేశం అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై ఏవీఎన్ రెడ్డికి పూర్తి అవగాహన ఉందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పరుశరాం, ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



గట్టు: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈఓ విజయానాయక్ వంట ఏజెన్సీలకు సూచించారు. శనివారం చాగదోన, బల్గెర పాఠశాలలను జెడ్పీ సీఈఓ విజయానాయక్ సందర్శించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చాగదోన పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బల్గెర ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా గొర్లఖాన్‌దొడ్డిలో నర్సరీని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఎంపీడీఓ చెన్నయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉర్సును జయప్రదం చేద్దాం



అమరచింత: పట్టణంలో వెలసిన సయ్యద్ షా రాజావలి దర్గా షరీఫ్ ఉర్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. రాజావలి దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఉర్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. మార్చి 10 నుంచి 12 వరకు జరిగే ఉర్సుకు సంబంధించి దర్గా పరిసరాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నమని వెల్లడించారు. 10న గంధోత్సవం, 11న తాజే చిరాక్, 12న ఖత్మే ఖురాన్‌తో ఉర్సు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో రఫీక్, ఇంతియాజ్, తౌఫిక్ పాల్గొన్నారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యంగా ముందుకు..



ఆత్మకూర్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని సర్పంచ్‌లు గ్రామస్తులకు వివరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఆయా శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నివారణ, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడిచెత్త, ఆరోగ్యం ఇతర విషయాల గురించి వివరించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం శనివారం ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, ట్రెయినింగ్ కోఆర్డినేటర్లు రాజు, కుర్మయ్య, రఘు, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

చిగురించిన ఆశలు



ఆర్డీఎస్ కెనాల్ కింద సాగు చేసిన మొక్కజొన్న పంట

- ఆర్డీఎస్ కెనాల్‌లో నిండుగా నీటి ప్రవాహం
- డిస్ట్రిబ్యూటరీలు, సబ్ డిస్ట్రిబ్యూటరీలకు అందుతున్న నీరు

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్‌లో పూర్తిస్థాయిలో సాగు నీరు పారుతుండటంతో ఆయకట్టు రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఆర్డీఎస్ కెనాల్‌లో 12 రోజులపాటు నీరు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. రైతుల ఆందోళనతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇండెంట్ నీటిని విడుదల చేయించారు. సుంకేసుల అధికారులతో మాట్లాడి నదిలో నీటి నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్ చేసి సాగునీరు విడుదల చేయటంతో సమస్య సద్దుమణిగింది. నాలుగు, ఐదు రోజులుగా పంటలకు నీటి తడులు ఇస్తూ రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు.

తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభించడంతో..

కర్నాటకలోని ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ నుంచి విడుదలవుతున్న నీరు డీ–23 వరకు వచ్చే వరకు పూర్తిగా నిలిచిపోతున్నాయి. డీ–23 నుంచి దిగువన ఉన్న డీ–40 వరకు తుమ్మిళ్ల లిఫ్ట్ నీళ్లే దిక్కవుతున్నాయి. తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ బంద్ అయితే రైతులు దిగాల చెందుతున్నారు. ఇటీవల తుంగభద్ర నదిలో నీటినిల్వలు లేక 12 రోజులపాటు మోటార్‌ను నిలిపివేశారు. దీంతో కొతకు వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళనకు గురయ్యారు. టీబీ డ్యాంలో ఇండెంట్ పెట్టి నీటిని వదలడంతో సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

మార్చి చివరి వరకు నీరందిస్తే..

ఈనెలాఖరు వరకు సాగునీరందిస్తే పంటలు పూర్తిస్థాయిలో చేతికొస్తాయని రైతులు పేర్కొంటున్నారు. మార్చి 15వ తేదీ వరకు సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటించారు. మార్చి 30 వరకు సాగునీరు అందిస్తే యాసంగిలో ఆలస్యంగా సాగుచేసిన మొక్కజొన్న, సీడు జొన్న పంటలకు ఇబ్బంది ఉండదని రైతులు వివరించారు.

చివరి ఆయకట్టుకు మొండిచేయి..

ఆర్డీఎస్ కెనాల్ కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన తుమ్మిళ్ల లిఫ్ట్ లక్ష్యం నెరవేరలేదు. తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నప్పటికి డీ–35 నుంచి డీ–40 వరకు చుక్క నీరందడంలేదు. ఆరు డిస్ట్రిబ్యుటరీల రైతులకు నిరాశలే మిగిలాయి.

వచ్చే ఏడాదైనా చర్యలు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని రైతులు కోరుతున్నారు.

లిఫ్ట్ ప్రారంభించకుంటే..



తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ప్రారంభించకుంటే పరిస్థితి దారుణంగా ఉండేది. మొక్కజొన్న పంట ఎండిపోయే పరిస్థితి దాపురించింది. సాగునీరు విడుదల చేయడంతో సంతోషంగా ఉంది. మరో 15 రోజులపాటు సాగునీరందించాలి.

– కృష్ణారెడ్డి, ఆయకట్టు రైతు, కొంకల

ముందస్తు చర్యలు తీసుకోవాలి



ఆర్డీఎస్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఆయకట్టు కింద నాలుగు ఎకరాలు మొక్కజొన్న పంట సాగు చేశా. గింజ గట్టిపడే దశలో 12 రోజులపాటు ఆర్డీఎస్ కెనాల్ ఎండిపోయింది. దీంతో 30 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది. వచ్చే ఏడాదైనా ముందస్తు ప్రణాళికతో అధికారులు చర్యలు తీసుకుని రైతులు నష్టపోకుండా చూడాలి.

– కిట్టు, ఆయకట్టు రైతు, రామాపురం

15వ తేదీ వరకు సాగునీరందిస్తాం



టీబీ డ్యాంలో పెట్టిన ఇండెంట్ నీటితో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం కొన సాగుతోంది. ప్రస్తుతం తుమ్మిళ్ల లిఫ్ట్ నడవడానికి సరిపడా నదిలో నీరుంది. నీటి నిల్వలు తగ్గిన వెంటనే చివరి ఇండెంట్ 0.82 టీఎంసీలు పెడతాం. మార్చి 15వ తేదీ వరకు సాగునీరందిస్తాం.

– విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఎస్ ఈఈ

సీసీ రోడ్డు నిర్మాణానికి సర్వే



సర్వే చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

అయిజ: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి వెటర్నీ ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు శనివారం సర్వే చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడారు. సర్వే రిపోర్ట్ ప్రకారం ప్రభుత్వానికి చెందిన భూమిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతామని, ప్రభుత్వ భూమిని కబ్జా చేసినవారు స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఏఈ గోపాల్, టీపీఓ కుర్మయ్య, మండల సర్వేయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

అయిజ: చిన్నారికి సరైన వైద్యం అందించలేదని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తూ శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. గట్టు మండలం బలిగెరకు చెందిన బాలుడికి గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఆస్పత్రిలో అపెండిసైటిస్ చికిత్స చేయించినా తిరిగి అదే సమస్య రావడంతో ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. వైద్యానికి ఖర్చు అయిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యులు నిరాకరించారు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా బాధిత కుటుంబసభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై వైద్యుడు విశాక్‌ను వివరణ కోరగా వైద్యుల తప్పేమి లేదని సమాధానం ఇచ్చాడు.

ఎమ్మెల్యేకు వినతి

గద్వాల రూరల్: ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు సెకండ్ క్వాలిటీ వస్తువులను ప్రజలకు తక్కువ ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తూ తమ వ్యాపారాలను దెబ్బతీస్తున్నారని గద్వాల పట్టణ వ్యాపారుల సంఘం నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం గద్వాల పట్టణంలో వ్యాపార దుకాణాలు మూసివేసి బంద్ పాటించారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇలాంటి అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుని స్థానిక వ్యాపారులకు అండగా ఉండాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ స్థానిక వ్యాపారస్తులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జొన్న సొప్ప దగ్ధం



అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్‌లో జొన్నసొప్ప విద్యుత్ తీగలకు తగిలి దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం రైతు జలంధర్ మూడు ఎకరాలలో సాగు చేసిన జొన్నసొప్పను పశువుల మేతకోసం శనివారం ట్రాక్టర్‌పై ఇంటికి తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో కాశీపూర్ నుంచి భైరపూర్‌కు వెళ్లే లైన్‌కు సంబంధించిన 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు జొన్నసొప్పకు తగలడంతో మంటలు చెలరేగాయి. గమనించిన రైతు ట్రాలీ నుంచి సొప్పను వేరు చేశాడు. స్థానికులు, టీజీ వెంకటేశ్ ఫ్యాక్టరీ ఫైర్ ఇంజన్ సహకారంతో మంటలను ఆర్పారు. సుమారు రూ.20 వేల వరకు నష్టం వచ్చినట్లు బాధిత రైతు తెలిపాడు.

రహదారికి మరమ్మతు



రహదారిలో పోసిన మట్టి

అమరచింత: పట్టణంలోని జగన్‌వాడలో గల ఇరుకైన రహదారిలో వృద్ధులు నడవలేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా రహదారికి మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించారు. జగన్‌వాడలోని కొంగరి భాస్కర్ ఇంటి పక్కన ఉన్న వీధిలో ప్రతినిత్యం కాలనీవాసులు తిరుగుతుంటారు. పక్షం రోజుల కిందట సీసీ రహదారి నిర్మించడంతో ఇరుకుగా ఉన్న వీధి రహదారి లోతట్టుకు చేరింది. దీంతో వృద్ధులు అటుగా వెళ్తూ కిందపడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. దీంతో ఆయన శనివారం కాలనీకి చేరుకొని వృద్ధులు పడుతున్న ఇబ్బందులను చూసి రహదారి మరమ్మతు పనులను వెంటనే చేపట్టారు. మొరం మట్టి కప్పి, వాటిపై త్వరలోనే సీసీ వేస్తామన్నారు. కమిషనర్ సకాలంలో స్పందించినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

పెబ్బేరు: పట్టణ సమీపంలో గల మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 100మంది విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయిస్‌ఫాతిమా, కౌన్సిలర్ సుమతి, ఎల్లయ్య, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఇందువాసిలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



ధరూరులో జిల్లా పరిషత్ పాఠశాలలో..

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాఘవేంద్ర పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందువాసి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కొండారెడ్డి, ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ భాస్కర్ పాపన్న, హెచ్‌ఎం కుర్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు మంజుల దేవి, రాణి లిలావతి, మసుమి, బాలమ్మ, సుధాకర్, పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు అల్వలాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉప్పేరు ప్రాథమిక పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ సిరాజుద్దీన్, ఎంఈఓ సురేష్, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని తాటికుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, శ్రీకాంత్, గీత, ఉష, మధు, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లి ప్రాథమికోన్నత పాఠశాల..

ధ్యానంతో రోగనిరోధక శక్తి



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి

రాజోళి: ధ్యానంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రచార కార్యదర్శి ఆంజనేయ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తుమ్మిళ్ల, పెద్ద తాండ్రపాడు, ముండ్లదిన్నె, పడమటి గార్లపాడు గ్రామాల్లో ఆయన ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ ధ్యానంతో జీవన విధానంలో మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. మంచి నడవడిక అలవడుతుందన్నారు. ప్రతిరోజు ఆనందంగా ఉంటామని, ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఈర్ష్య, ద్వేషం, అసూయ దరిచేరవన్నారు. దీర్ఘకాలిక రోగాల నుంచి బయటపడవచ్చని వివరించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, రాధ, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, సుభద్ర, స్వప్న, శైలజ, శోభ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో సృజనాత్మకత



ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అలంపూర్: విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఉండవెల్లి ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. శనివారం అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సీఐ సూర్యనాయక్, విశ్వశాంతి విద్యాలయాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డిలతో కలిసి ఎంఈఓ శివప్రసాద్ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని నర్సరీ నుంచి 9వ తరగతి విద్యార్థులు వివిధ విజ్ఞాన ప్రాజెక్టులను ప్రదర్శించారు. 1100 మంది విద్యార్థులు 150 ప్రాజెక్టులను ప్రదర్శించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సాంఘీక, సామాన్య శాస్త్రాల ప్రాముఖ్యంపై ప్రాజెక్టులను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. కృత్యాలు చేయడం వలన స్వతహాగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఈఓ దేవేందర్ రెడ్డి, ఉండవెల్లి ఎస్ఐ బాలరాజు, ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అదే విధంగా కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



విద్యార్థులతో మాట్లాడుతున్న ముషాయిదా బేగం

ఉండవెల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముషాయిదా బేగం అన్నారు. శనివారం మండలంలోని కంచుపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను జెడ్పీ సీఈఓ పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం గదిని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీను పరిశీలించి మొక్కలను ఎండా కాలంలో మొక్కలకు రక్షణగా గ్రీన్ నెట్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీని పరిశీలించి, పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జరీనాబేగం, హెచ్‌ఎం శంకర్ నాయుడు, రాధిక, నాగేందర్ రావు, శారద, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదన్ రెడ్డి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదన్ రెడ్డి, ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ శ్యాంసుందర్‌లు అన్నారు. శనివారం మండలంలోని పెద్దొడ్డిలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వారు సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ కాన్పులు అయ్యే విధంగా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో 30 సంవత్సరాలు నిండిన వారందరికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమరచింత: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహం విద్యార్థులకు తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డా శరత్ ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జ్వరం, తలనొప్పి, చర్మ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి మందులు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వసతి గృహాలను ప్రతి వారం సందర్శించి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహంలోని విద్యార్థులు పాఠశాలకు రావడంతో పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో హాస్టల్ విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలను సైతం నిర్వహించారు. వెన్నునొప్పితో బాధపడుతున్న విద్యార్థితో పాటు కంటి చూపు సమస్యతో బాధపడుతున్న 8 మందిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి సిఫార్స్ చేశామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని బీసీ హాస్టర్ విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. 20మంది విద్యార్థులకు ఆరోగ్యం సమస్యలు ఉండడంతో మందులు ఇచ్చామన్నారు. సీజన్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ శివయ్య,వైద్య సిబ్బంది రాజ శేఖర్, ఆశా వర్కర్స్ రమాదేవి, జ్యోతి పాల్గొన్నారు.